ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.9 • కనిష్ఠం 24.8
నిర్మల్ జిల్లా వార్తలు
8
సోమవారం 11 ఆగస్టు 2025



నేటి నుంచి ఆర్జీయూకేటీలో విద్యార్థుల చేరికలు

బాసర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికి కొత్తగా ఎంపికయిన విద్యార్థుల రిపోర్టింగ్ తేదీలను అధికారులు ప్రకటించారు. బాసర క్యాంపస్‌కు, ఎంపికయిన విద్యార్థులు ఈ నెల 11, 12 తేదీల్లో, మహబూబ్‌నగర్‌లో కొత్తగా ఏర్పాటు అయిన క్యాంపస్‌కు ఎంపికయిన విద్యార్థులు ఈనెల 17వ తేదీన రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బాసర, మహబూబ్‌నగర్ క్యాంపస్లకు ఎంపికయిన విద్యార్థులు ఆయా క్యాంపస్‌లోనే రిపోర్టింగ్ ఇవ్వాలని సూచించారు. మరిన్ని వివరాలకు విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని చెప్పారు.

పైకం చెల్లించినా..
పత్రం అందలేదు!

- ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్ కోసం లబ్ధిదారుల నిరీక్షణ
- జిల్లా వ్యాప్తంగా 44,599 దరఖాస్తులు
- ఫీజు చెల్లించినది 6,836 మంది
- ఎల్ఆర్ఎస్ ఫీజుల ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం రూ. 14.6 కోట్లు
- ఇప్పటి వరకు 5,685 మంది దరఖాస్తుదారులకు అందిన ప్రొసీడింగ్స్



మస్కాపూర్‌లో ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్)

ఖానాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా ఉన్న లేఅవుట్ ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు 2020లో అప్పటి ప్రభుత్వం తెచ్చిన ఎల్ఆర్ఎస్ విధానం ద్వారా పలువురు తమ ప్లాట్‌లను క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో దరఖాస్తు చేసుకున్న వారిలో కొంత మంది అప్పట్లోనే ఫీజులు చెల్లించినప్పటికీ మరికొంత మంది రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఎల్ఆర్ఎస్ చెల్లించిన వారికి ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో ప్రొసీడింగ్స్ అందకపోవడంతో ఇంకా తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు దరఖాస్తుదారులకు నిరీక్షణ తప్పడం లేదు. ఫీజు చెల్లించిన వారి నుంచి ఇప్పటికీ మెజారిటీ దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్స్ అందించామని టెక్నికల్ ప్రాబ్లంతో కొన్ని ప్రొసీడింగ్స్ ఇంకా అందించాల్సి ఉందని త్వరలోనే వాటిని సైతం అందజేస్తామని అధికారులు చెబుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 44,599 దరఖాస్తులు

2020లో అక్రమ లే అవుట్లను రెగ్యులరైజ్ చేస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించిన తర్వాత ఎల్ఆర్ఎస్‌లో భాగంగా దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రక్రియలో జిల్లా వ్యాప్తంగా నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో 15,550, భైంసా మున్సిపాలిటీ పరిధిలో 9,058, ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 1929 దరఖాస్తులు రాగా జిల్లాలోని 420 గ్రామాల్లో 18,065 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 44,599 దరఖాస్తులు వచ్చాయని చెబుతున్నారు. ఈ దరఖాస్తులు వచ్చిన సమయంలో కొంత మంది ఎల్ఆర్ఎస్ ఫీజును సైతం చెల్లించినప్పటికీ ఆ తర్వాత జరిగిన పరిణామాలతో ఆ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఎన్నికల కోడ్ రావడం కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2024 డిసెంబరులో తిరిగి ఎల్ఆర్ఎస్ మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రభుత్వం రాయితీ ప్రకటించడంతో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న పలువురు ఫీజులు చెల్లించడం ప్రారంభించారు.

ఫీజు చెల్లించింది 6,836 మంది

నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో 2,630 మంది ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించగా వారి ద్వారా ప్రభుత్వానికి రూ.7.16 కోట్లు ఆదాయం వచ్చింది. భైంసా మున్సిపాలిటీ పరిధిలో 800ల మంది ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించగా వారి ద్వారా ప్రభుత్వానికి రూ.ఒక కోటి ఆదాయం వచ్చింది. ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 176 మంది ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించగా వారి ద్వారా ప్రభుత్వానికి రూ.31లక్షలు ఆదాయం వచ్చింది. జిల్లాలోని ఆయా మండలాల్లో గల 420 గ్రామాల పరిధిలో 3,230 మంది ఎల్ఆర్ఎస్‌కు రుసుము చెల్లించగా రూ. 6.13 కోట్ల ఆదాయం వచ్చింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 6,836 మంది ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించడంతో ప్రభుత్వానికి రూ. 14.6 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

1151 మందికి తప్పని నిరీక్షణ

తెలంగాణ ప్రభుత్వం జూన్ 30వ తేదీ వరకు ఎల్ఆర్ఎస్ చెల్లించిన వారికి 25 శాతం రాయితీ ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా 6,836 మంది ఎల్ఆర్ఎస్ కోసం ఫీజులు చెల్లించారు. కాగా ఇప్పటి వరకు జిల్లాలో 5,685 మంది దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్స్ అందించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా జిల్లాలో 1151 మంది దరఖాస్తుదారులకు ఎల్ఆర్ఎస్ తాలూకు ప్రొసీడింగ్స్ అందలేదని అధికారులు వెల్లడిస్తున్నారు. కొంత సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ 1151 మందికి ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్ అందజేయడంలో జాప్యం జరుగుతోందని త్వరలోనే ఆ సమస్యకు పరిష్కారం చూపుతామని చెబుతున్నారు. తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వానికి డబ్బులు చెల్లించినప్పటికీ ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్ తమకు ఇంకా అందకపోవడంపై దరఖాస్తుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సాంకేతిక సమస్యలను పరిష్కరించి తమ సమస్యను పరిష్కరించాలని, వెంటనే ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్ అందజేయాలని కోరుతున్నారు.

ఎల్ఆర్ఎస్ చెల్లించి ఆరు నెలలైనా ఇప్పటికీ ప్రొసీడింగ్ అందలేదు

• చిలుకూరి తిరుమలేష్, మస్కాపూర్

మస్కాపూర్ శివారులో గల నాప్లాట్‌ను క్రమబద్ధీకరించుకునేందుకు ఆరు నెలల క్రితం ఎల్ఆర్ఎస్ చెల్లించాను. ప్రభుత్వం రాయితీ ప్రకటించిన సమయంలో చెల్లించడంతో రూ.11 వేలు చెల్లించాల్సి ఉంటే రాయితీపై రూ. 98వేలు చెల్లించాను. ఇప్పటి వరకు ప్రొసీడింగ్స్ అందలేదు. ఎందుకు రావడం లేదని అధికారులను అడిగితే వస్తుందని వేచి చూడాలని సమాధానం ఇస్తున్నారు.

పెండింగ్‌లో ఉన్న వారికి త్వరలోనే ప్రొసీడింగ్స్ అందుతాయి

• ఏ. హరీష్ కుమార్, జిల్లా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి

జిల్లాలో ఇప్పటి వరకు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన 5,685 మందికి ప్రొసీడింగ్స్ అందజేశాం. మరో 1151 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. టెక్నికల్ సమస్యతో వీరికి ప్రొసీడింగ్స్ అందజేయడంలో జాప్యం జరిగింది. త్వరలోనే ఆ సమస్యను పరిష్కరించి పెండింగ్ ప్రొసీడింగ్స్ అందజేస్తాం.

రోడ్ల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే

- హ్యామ్ పథకం కింద అనుమతి
- అర్లి వంతెన నిర్మాణం
- మెరుగుకానున్న మూడు ప్రాంతాల రోడ్లు
- సమావేశంలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్

భైంసా, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో హ్యామ్ పథకం కింద ఆర్అండ్‌బీ పరిధిలో గల మూడురూట్లలోని 54 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపిందని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ వెల్లడించారు. ఆదివారం భైంసాలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. దశాబ్దంన్నరకు పైగా కాలం నుంచి హామీలకు, ప్రతిపాదనలకు పరిమితమవుతున్న అర్లి నూతన వంతెన నిర్మాణానికి సైతం హ్యామ్ పథకం ద్వారా చేపట్టేందుకు ప్రభుత్వం మంజూరు ఇచ్చిందని తెలిపారు. జీవోనెంబర్ 389 ద్వారా అర్లి నూతన వంతెన నిర్మాణంతో పాటు మూడురూట్లలోని 54 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణపు పనులను ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. భైంసా నుంచి గొడిసేరా మీదుగా కుభీర్, పార్డీ(కే), పల్సి, సిరిపెల్లి వరకు 27 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం జరుగనుందని పేర్కొన్నారు. ముథోల్ నుంచి సింగన్‌గాఫ్ మీదుగా తానూర్, జౌళా (కే), వడ్‌గావ్ మీదుగా మహారాష్ట్ర సరిహద్దు వరకు 18 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం చేపడుతామని తెలిపారు. అర్లి బ్రిడ్జీతో పాటు కిష్టపూర్ మీదుగా లోకేశ్వరం వరకు 9 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మా ణం చేపట్టనున్నారని వివరించారు. హ్యామ్ పథకం కింద జిల్లాకు 127 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణపు పనులు మంజూరు అవగా ఇందులో ముథోల్‌నియోజక వర్గ పరిధిలో 54 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణాలు జరుగనున్నాయని స్పష్టం చేశారు. మొదటిదశ కింద సంబంధిత రోడ్లు మంజూరయ్యాయని, రానున్న జనవరిలో మరిన్ని ప్రాంతాలకు రోడ్లు మంజూరు కానున్నాయని వివరించారు. ఇందులో డివిజన్ పరిధిలోని బీజేపీ ప్రతినిధులు బోస్లే పండిత్‌రావ్ పాటిల్, శివాజీ పాటిల్, నర్సారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

పశువుల చోరీలో ఒకరి అరెస్ట్

- మిగతా నిందితుల కోసం ప్రత్యేక టీంలతో గాలింపు
- ఏఎస్పీ అవినాష్‌కుమార్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ

ముథోల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) :ముథోల్‌లో వారం క్రితం హంగిర్గా భోజన్న అనే రైతుకు చెందిన పశువుల చోరీ కేసులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ తెలిపారు. ముథోల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ జానకిషర్మిల ఆదేశాల మేరకు ఈ కేసులో ముథోల్ సీఐ మల్లేష్, భైంసాటౌన్ సీఐ గోపీనాథ్, భైంసా రూరల్ సీఐ నైలు, ముథోల్, తానూర్ ఎస్సైలు బిట్ల పెర్సిస్, జుబేర్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీం ద్వారా మహారాష్ట్రతో పాటు ఆయా రాష్ట్రాల్లో నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మహ్మద్ ఫైజాన్‌ను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఈ కేసులో మరో ఆరుగురు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పశువుల చోరీకి ముథోల్‌కు దొంగలు వచ్చినప్పుడు నిందితుల వాహనం సీసీ కెమెరాలో కనిపించడంతో ఐటీకోర్, సీసీఎస్ పోలీసుల సహాయంతో సాంకేతిక ఆధారాలతో ఈ కేసును ఛేదించామన్నారు. సీసీ కెమెరాలో కనిపించిన వాహనాన్ని నాందేడ్ గ్యారేజీలో గుర్తించామన్నారు. శనివారం ముథోల్ నయాబాది సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా నేరస్తుడు ఎంహెచ్ 20 ఏజై 7786 నెంబర్ గల ఇన్నోవా వాహనంలో పారిపోతుండగా పోలీసులు వెంబడించి వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు. ఈ పశువుల చోరీ ముఠా ముందుగా వాహనాల్లో సీట్లను తొలగించి ఆరుబయట ఉన్న పశువులకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి, దొంగలిస్తున్నారని తెలిపారు. దొంగలించిన పశువులను తెలంగాణ సరిహద్దుల్లో పశువుల మాంసాన్ని తీసుకెళ్లి, కళేబరాలను వదిలి వెళ్తున్నారని తెలిపారు. మహారాష్ట్రలో పశువుల మాంసం నిషేధం ఉండటంతో పాటు డిమాండ్ ఉండడంతో ఈ చోరీలు జరుగుతున్నాయని అడిషనల్ ఎస్పీ పేర్కొన్నారు. అనుమతి లేకుండా వాహనంలో సీట్లను తొలగిస్తే మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే భైంసాలో రెండు వాహనాలను స్వాధీనపరచుకున్నామన్నారు. వాహనాలపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా మోటార్ వెహికల్ అధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల్లో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో భైంసా రూరల్ సీఐ నైలు, ముథోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ పాల్గొన్నారు.

చోరీలను అరికట్టాలని ఏఎస్పీకి వినతి

ముథోల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో పశువుల చోరీలను అరికట్టాలని ముథోల్ వీడీసీ సంఘం, బీజేపీ, హిందూ వాహిని కార్యకర్తలు, గ్రామస్థులు భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్‌ను కోరారు. ముథోల్ పోలీస్‌స్టేషన్‌కు అడిషనల్ ఎస్పీ వచ్చిన విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఆదివారం తాము ఎదుర్కొంటున్న సమస్యను తెలిపారు. ఆరుబయట ఉన్న పశువులను దొంగలు చోరీ చేసి, దొంగలు మాంసం తీసుకెళ్లటంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ కేసులో ఒక్కరిని అరెస్ట్ చేశామని అడిషనల్ ఎస్పీ తెలిపారు. మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు , సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు విఠల్, కోశాధికారి వెంకటేష్, నగేష్, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు లడ్డు పోతన్న, దేవోజీ భూమేష్, సాయినాథ్ పాల్గొన్నారు.

రైస్‌మిల్లులపై కేసు నమోదు

ముథోల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముద్గల్ గ్రామంలో గల రెండు రైస్ మిల్లులపై కేసు నమోదు చేసినట్లు ముథోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ ఆదివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... ముద్గల్ గ్రామ సమీప గ్రామంలో గల ఏషియన్ రైస్‌మిల్‌లో యజమాని ము షారొద్దీన్ 2024-25 సంవత్సరం ఖరీఫ్, రబీలో సేకరించిన 4411.917 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యంను ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వాల్సి ఉండగా ఇవ్వలేదని తెలిపారు. అలాగే గణపతి రైస్‌మిల్‌లో యజమాని చింత శ్రీనివాస్ 2024-25 ఖరీఫ్, రబీలో 2699.531 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బియ్యంగా మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వలేదు. దీంతో సివిల్ సప్లై అధికారులు రైస్ మిల్లులను తనిఖీ చేసి, అక్కడ బియ్యం నిల్వలు లేకపోవడంతో ఈ నెల 8వ తేదీన ముథోల్ పోలీస్‌స్టేషన్‌లో సివిల్ సప్లై డీఎం సుధాకర్ ఫిర్యా దు చేశారని ఎస్సై చెప్పారు. రైస్‌మిల్లుల యజమానులు ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. ఏషియల్ రైస్‌మిల్ యజమాని 12 శాతం వడ్డీతో కలిపి సుమారు రూ. 18 కోట్ల 1 లక్ష 3205 రూపాయలు, గణపతి రైస్ మిల్ యజమాని రూ. 11 కోట్ల 2 లక్షల 191 రూపాయల విలువ గల దుర్వినియోగంకు పాల్పడ్డారని సివిల్ సప్లై అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. రైస్‌మిల్ యజమానులపై సెక్షన్ 316(2), 316(5), 318(4) బీఎన్ఎస్‌తో పాటు వివిధ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సివిల్ సప్లై డీఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

13,14న ప్రత్యేక ఆధార్ క్యాంపులు

• జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి పరమేశ్వర్

ముథోల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థుల ఆధార్‌నమోదు కోసం గతంలో ఆధార్ కార్డులలోని తప్పుల సవరణ కోసం జిల్లాలో ప్రత్యేకంగా ఈ నెల 13, 14వ తేదీన ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి మూడారపు పరమేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 18 మండల కేంద్రాలతో పాటు నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీ పరిధిలో కూడా ఈ ఆధార్ ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులు గాని, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గాని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నూతనంగా విద్యార్థుల ఆధార్ నమోదు కాని, గతంలో ఆధార్ కార్డు ఉండి ఏవైనా తప్పులు ఉంటే వాటిని సవరణ చేయించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేజీబీవీలో ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

దిలావర్‌పూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో స్వీపర్‌కం స్కావెంజర్‌గా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి కే.శంకర్ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, ఎస్టీ సామాజికవర్గానికి చెందినవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. మండల స్థాయి సెలక్షన్ కమిటీ దరఖాస్తులను పరిశీలించి మెరిట్‌ప్రకారం ఉద్యోగాన్ని ఇవ్వనున్నట్లు చెప్పారు.

రైతు బీమా పథకం కోసం
దరఖాస్తు చేసుకోవాలి

• జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

సోన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు వచ్చి, ఇంతవరకు రైతు బీమా చేసుకొని నిర్మల్ జిల్లాలోని రైతులు రైతు బీమా దరఖాస్తు చేసుకోవాలని ఆదివారం జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ... ఈ నెల 13తో రైతు బీమా దరఖాస్తు ముగుస్తుందని తెలిపారు. బీమాకు దరఖాస్తు చేసుకోదలచిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, రైతుఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌లు తీసుకొని రైతు వేదికలకు రావాలని తెలిపారు. 14 ఆగస్టు 1966 నుంచి 14 ఆగస్టు 2007 మధ్యలో పుట్టిన రైతులు మాత్రమే రైతు బీమాకు అర్హులని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం గ్రామాల్లో నానో డీఏపీ, నానోయూరియా పిచికారి చేసి పండిస్తున్న మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో వినోద్ కుమార్, రైతులు, నర్సారెడ్డి, భీమేష్, జిలకర వేణు, మోహన్‌లు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

ముథోల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో మరపురాని జ్ఞాపకాలను నెమరు వేసుకునే ఆత్మీయ సమ్మేళనం ఎన్నటికీ మరువలేనిదని పలువురు పూర్వ విద్యార్థులు అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 1995-2003 వరకు 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుమారు 22 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకేచోట చేరి ఆత్మీయ పలకరింపులతో యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. స్థానిక బసవగార్డెన్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ తోటి విద్యార్థులకు ఉపయోగపడతామంటూ తీర్మానాలు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆప్యాయంగా పలకరించి, సన్మానించారు. తమ విద్య వైవాహిక, ఉద్యోగ, జీవిత విశేషాలు, కుటుంబనేపథ్యాల గురించి ఒకరినొకరు చెప్పుకుంటూ సెల్ఫీలు, ఫోటోలు తీసుకుంటూ ఎంతో ఆనందోత్సాహాలతో గడిపారు. 80 మంది పూర్వవిద్యార్థులతో సుమారు 45 మంది విద్యార్థులకు వివిధ హోదాలలో ఉద్యోగస్తులుగా పని చేయగా మరో 40 మంది బిజినెస్ పరంగా వ్యవసాయపరంగా వివిధ రంగాల్లో వృద్ధి చెందారని వారు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు య. గంగన్న, ఎన్.గంగన్న, మజారొద్దీన్, మోహన్, రవికుమార్, నగేష్, నరేందర్, తదితర ఉపాధ్యాయులతో పాటు పూర్వవిద్యార్థులు యు.అనిల్, సిహెచ్. శ్రీనివాస్, సోమన్న, రాందాస్, దయాకర్, గంగాధర్, భీమన్న, నరేష్, సతీష్, దేవన్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సిరాల ఆయకట్టుకు మంచి రోజులు

- పూర్తయిన ప్రాజెక్టు పునర్నిర్మాణం
- జోరుగా సాగునీటి కాలువ మరమ్మతు పనులు
- రెండు సీజన్లకు అందనున్న సాగునీరు
- ఫలించిన ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ కృషి



సిరాల ప్రాజెక్టు


భైంసా, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు పునర్ నిర్మాణపు పనులు పూర్తయిన నేపథ్యంలో సిరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందే మంచి రోజులు వచ్చాయి. రెండు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలు, వరదల మూ లంగా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో దెబ్బతినడంతో నీటినిల్వకు అవకాశం లేకుండా పోయింది. ప్రధానకాలువ పూడికతో నిండింది. ఈ క్రమంలో రెండు సంవత్సరాలుగా ఆయకట్టు భూములకు సాగునీరు అందకుండా పోయింది . ఆయకట్టు రైతాంగం ప్రత్యామ్నాయ చర్యలు ద్వారా సాగుకు ఉపక్రమించినప్పటికీ ఆశించిన ఫలితాలు కానరాలేదు. ఆయకట్టు రైతుల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ ప్రాజెక్టు పునర్ నిర్మాణం, ప్రధాన కాలువ పునరుద్ధరణకు బాధ్యతాయుతంగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. ఇందులో భాగంగానే ప్రభుత్వం గత సంవత్సరం ప్రాజెక్టు పునర్ నిర్మాణం, ప్రధాన కాలువ మరమ్మతుల కోసం గాను రూ.12 కోట్లు విడుదల చేసింది. దీంతో ప్రాజెక్టు సంబంధించిన పునర్ నిర్మాణపు పనులన్నీ రెండు నెలల క్రితం పూర్తవడంతో నీటి నిల్వ మొదలయింది. దీనికి తోడు ప్రస్తుతం ప్రాజెక్టుకు సంబంధించి ప్రధాన కాలువలో పేరుకపోయిన పూడిక తొలగింపులు, దెబ్బతిన్న చోట మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రస్తుత వానకాలం సీజన్‌తో పాటు రానున్న యాసంగి సీజన్ లోనా ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీరు అందనుంది.

• 1895 ఎకరాల ఆయకట్టు

సిరాల ప్రాజెక్టు కింద భైంసా మండల పరిధిలోని సిరాల, ఇలేగాం, దేగాం, వాలేగాం తదితర గ్రామాల పరిధిలో 1895 ఎకరాలు ఆయకట్టు ఉంది. సంబంధిత ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు గాను 9.6 కిలో మీటర్ల మేర ప్రధాన కాలువ ఉంది. రెండు నెలల క్రితం పునర్ నిర్మాణపు పనులు పూర్తయిన నేపథ్యంలో ప్రాజెక్టులో నీటినిల్వకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి వరదనీటి చేరిక జరిగింది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 0.20 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 0.15 టీఎంసీలు నీటి నిల్వలతో నిండు కుండను తలపించే స్థితికి చేరుకుంది. ఇక ప్రధాన కాలువ మరమ్మతుపనులు జోరు మీద కొనసాగుతున్నాయి. 9.6 కిలోమీటర్ల మేరనున్న ప్రధాన కాలువలోని పూడిక తొలగింపులతో పాటు అవసరమైన మరమ్మతు పునులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఆయకట్టుకు వానాకాలపు సీజన్‌తో పాటు యాసంగిలో సైతం సాగునీరు అందనుంది. ప్రాజెక్టు ఆయకట్టు రైతాంగం సాగుపనులను ముమ్మరం చేశారు. రెండు సంవత్సరాల పాటు ఊగిసలాడే ధోరణితో సాగు చేపట్టిన రైతాంగం ప్రస్తుత సీజన్‌లో సాగునీరు అందే పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పూర్తిస్థాయి ధీమాతో సాగు పనులను వేగవంతం చేశారు. కొంత మంది ఆయకట్టు రైతాంగం ఇప్పటికే వరినాట్లు పూర్తి చేసుకోగా మిగతా రైతాంగం పనులను వేగవంతం చేశారు.

సాగునీటి కల్పనపై ప్రధానదృష్టి

• పవార్ రామరావ్ పాటిల్, ఎమ్మెల్యే, ముథోల్



నియోజకవర్గ పరిధిలోని అన్నదాతల సంక్షేమం కోసం గాను సాగునీటి వ్యవస్థ మెరుగుదలపై ప్రత్యేకదృష్టి సారించాం. సాగునీటి వనరుల ద్వారా ఆయకట్టు భూములకు నిర్దేశిత లక్ష్యం మేర సాగునీరు అందింపచేయడమే ధ్యేయంగా చర్యలు చేపడుతున్నాం. ఇందులో భాగంగానే సిరాల ప్రాజెక్టు పునర్నిర్మాణాన్ని పట్టుబట్టి చేయించడం జరిగింది.

యోగా పోటీల్లో జాతీయస్థాయికి ఎంపిక



యోగాసనాలలో జాతీయస్థాయికి ఎంపికైన సురేందర్

నిర్మల్‌రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండలం కనకాపూర్ గ్రామానికి చెందిన దెబ్బడి సురేందర్ ఇటీవల ఆదిలాబాద్‌లో జరిగిన 6వ రాష్ట్రస్థాయి పోటీల్లో సీనియర్ విభాగంలో కామారెడ్డి జిల్లా తరుపున రెండువిభాగాల్లో పా ల్గొని బ్యాక్ బెండింగ్‌లో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. సీనియర్ ట్రెడిషనల్ విభాగంలో రజత పతకం సాధించినట్లు తెలిపారు. చత్తీస్‌గడ్‌లో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ప్రతి రోజు ఉదయం రెండుగంటలు సాధన చేశానని తెలిపారు. ఇటీవల సిద్దిపేటలో రాష్ట్రస్థాయిలో జరిగినసూర్యనమస్కార పోటీల్లో 800ల రౌండ్‌లు పూర్తిచేసినట్లు తెలిపారు. యోగ పట్ల మక్కువతో పతంజలి యూనివర్సిటీ నుంచి అసిస్టెంట్ యోగ, ఎంఎస్‌సీ యోగ పూర్తిచేసినట్లు తెలిపారు.

సరస్వతి కాలువలో కాలుజారి పడి వ్యక్తి మృతి

సోన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు సరస్వతి కాలువలో కాలుజారి పడి వ్యక్తి మృతిచెందినట్లు సోన్ సీఐ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూవెల్మల్ గ్రామానికి చెందిన మృతుడు బొడ్డు సుధాకర్(37) వరుసకు అన్న అయిన బొడ్డు పెద్ద లస్మన్నతో చేనులోకి వెళ్లాడు. సరస్వతి కెనాల్‌లో అమర్చిన మోటార్ నుంచి నీళ్లు వస్తలేదని, దానికి తట్టుకున్న చెత్తా చెదారాన్ని తీసివేసే క్రమంలో సుధాకర్ కాలుజారి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్‌లోని ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించినట్లు తెలిపారు. మృతుడి భార్యలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

హుండీ పగులగొట్టి చోరీ

నర్సాపూర్(జి), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రామాలయం గుడిలో హుండీ పగులగొట్టి చోరీ జరిగింది. ఆగస్టు 8, 2025న మధ్యాహ్నం 3:30 గంటలకు ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదుదారుడైన జోలిగే రాంనాథ్(58) గుడికి వెళ్తుండగా గుడిగేటు వద్ద దండ్ల రాజేందర్(23) అనే వ్యక్తి అనుమానాస్పదంగా డబ్బులు జేబులో పెట్టుకోవడం చూశారు. రాంనాథ్ అతడిని ప్రశ్నించగా గుడి తాళం పగిలి ఉండటం, లోపల హుండీ చెక్కలు పగులగొట్టి ఉండటం గమనించారు. వెంటనే గుడి కమిటీ సభ్యులైన గోపిడి గంగారెడ్డి, మాన్పురి నారాయణలకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి నిందితుడిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. చోరీ అయిన డబ్బు విలువ సుమారు రూ. 1500ల నుండి రూ. 2000ల వరకు ఉండవచ్చని రాంనాథ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ముథోల్‌లో ఎడ్లచోరీకి యత్నం

ముథోల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లో సాయిమాధవ్‌నగర్ గల్లీలో బాబుపటేల్ అనే రైతుకు చెందిన తన వ్యవసాయ కొట్టంలో ఉన్న రెండు ఎద్దులను శనివారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి యత్నించారు. ఎద్దులు వారిపై దాడికి యత్నించడంతో దొంగలు పరారై ఉండవచ్చని స్థానికులు అంటున్నారు. ఈ ఎద్దులు స్థానిక హనుమాన్ మందిరం వరకు వెళ్లాయి. అక్కడ ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా భక్తి పాటలు, భజన కార్యక్రమం నిర్వహిస్తున్న స్థానికుల కంటపడ్డాయి. దీంతో ఈ విషయం బయట పడిందని స్థానికులు పేర్కొంటున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చుట్టుపక్కల దొంగల కోసం వెతికినా ఆచూకీ లభించలేదు.

రెండు బస్సులు ఢీ.. పలువురికి గాయాలు



అతివేగంగా ఢీకొన్న బస్సు

సారంగాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల చించోలి(బీ) గ్రామసమీపంలో ఆదివారం నిర్మల్, ఆదిలాబాద్, రహదారి పై రెండు బస్సులు ఢీకొని పలువురికి గాయాలైనట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదిలాబాద్ నుంచి నిర్మల్‌వైపు వస్తున్న ఆదిలాబాద్‌కు చెందిన ప్రయివేటు బస్సు ఆదిలాబాద్ డిపోకు చెందిన బస్సు ఢీకొన్నాయి. బస్సులో ప్రయాణిస్తున్న తోకలసునీత, అశ్విన్, కార్తీక్‌గౌడ్, ఇందిరా కాంతాబాయి అనే ప్రయాణికులకు స్వల్పగాయాలు కావడంతో క్షతగాత్రులకు చికిత్స నిమిత్తం నిర్మల్ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. బస్సుడ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నర్సాపూర్‌లో భారీ వర్షం

నర్సాపూర్(జి), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో భారీ ఉరుముల శబ్దానికి ప్రజలు ఒక్కసారిగా భయపడ్డారు. ఆదివారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమైంది. ఈ క్రమంలో ఆకాశంలో భారీశబ్దంతో ఉరుములు రావడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. వర్షం వల్ల వాతావరణం చల్లబడినప్పటికీ ఆకస్మికంగా వచ్చిన భారీ శబ్దానికి ప్రజలు కొంత ఆందోళనకు గురయ్యారు. ఉరుముల శబ్దాలు, మెరుపులు చాలా తీవ్రంగా ఉన్నాయని స్థానికులు తెలిపారు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నర్సాపూర్(జి), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్(జి) బస్టాండ్ సమీపంలోని ఎన్‌హెచ్-61 వద్ద ఆదివారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. రాంపూర్ గ్రామానికి చెందిన సురకుంట నవీన్ రెడ్డి(42) కారును నిర్మల్ వైపు నుంచి భైంసా వైపు వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాంపూర్ గ్రామానికి చెందిన సురకుంట నవీన్‌రెడ్డి తన కారులో కుస్లి రోడ్డు నుంచి పీహెచ్‌సీ ఆస్పత్రి వైపు వెళ్తుండగా నర్సాపూర్(జి) బస్టాండ్ వద్ద ఎన్‌హెచ్-61ని దాటుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. అదే సమయంలో నిర్మల్ వైపు నుంచి భైంసా వైపు అతివేగంగా అజాగ్రత్తగా వస్తున్న ఐచర్ వాహనం (డ్రైవర్ సాదుల్లా, కర్నాటక) నవీన్ రెడ్డి కారు ముందు భాగాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అవ్వగా, డోర్లు, అద్దాలు పగిలిపోయాయి. నవీన్ రెడ్డికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం. ఈ ఘటనపై నవీన్ రెడ్డి తండ్రి సురకుంట నర్సారెడ్డి నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన ఎస్సై గణేష్ ఐచర్ డ్రైవర్ సాదుల్లాపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టినట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

దిలావర్‌పూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా పట్టాదారు పాస్ బుక్‌లు పొందిన అన్నదాతలు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. 18-59 సంవత్సరాల వయస్సు కలిగినవారు రైతు బీమా చేసుకునేందుకు అర్హులన్నారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ కాపీలను దరఖాస్తు ఫారానికి జత చేసి ఈనెల 13వ తేదీ లోపు మండల వ్యవసాయ అధికారి కార్యాలయం లో అందజేయాలని ఆయన కోరారు.

లక్ష్మణచాంద : నూతనంగా పట్టాపాస్ పుస్తకం పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వసంత్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ భారతి పోర్టల్‌లో తన భూమి నమోదై ఉండాలని చెప్పారు. ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్, నామిని ఆధార్ జిరాక్స్‌లతో సంబంధిత రైతు స్వయంగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 13వ తేదీ చివరి తేదీ అని కావునా ఆలోపు తప్పకుండా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కుంటాల : 2025 -26 సంవత్సరం భూభారతి పథకం ద్వారా జూన్ 5వ తేదీ 2025 వరకు పట్టాపాస్‌బుక్ పొందిన రైతులు ఈనెల 12వ తేదీలోగా రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి విక్రమ్ తెలిపారు. 18 సంవత్సరముల నుంచి 59 సంవత్సరాల వయస్సు లోపు వారు ఈ బీమా పథకానికి అర్హులని, దరఖాస్తు చేసుకునే ముం దు దరఖాస్తు ఫారం, పట్టా పాసుపుస్తకం, రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్‌కార్డు సత్వరమే జతచేసి సంబంధిత రైతు వ్యవసాయాధికారికి అందజేయాలని సూచించారు.

బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేది ఎన్నడు..?

● మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేసేంతవరకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామ ని, బీసీలకు అనేక హామీలు ఇచ్చిన ప్రభుత్వం వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న మండిపడ్డారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసి న మీడియా సమావేశంలో ఆయన పాల్గొని ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సమావేశంలో నాయకులు మర్శెట్టి గోవర్ధన్, రౌత్ మనోహర్, మెట్టు ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



భూమి పూజ చేస్తున్న బోథ్‌ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని లింగట్ల గ్రామ పంచాయతీ పరిధిలోగల గోండుగూడ, కమ్యూనిటీహాల్, పాఠశాల కంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌కు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఇచ్చిన హామీ ప్రతిది నేరవేర్చేందుకు కృషి చేస్తున్నానన్నారు. రాఖీ పండుగ సందర్భంగా ఎమ్మెల్యేకు మహిళలు రాఖీ కట్టారు. పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరగా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఇప్పుడేం చేద్దాం

● ఆంధ్రజ్యోతి కథనంపై ఆర్ఎంపీల్లో తీవ్రమైన చర్చ

● స్థాయికి మించి వైద్యం చేస్తే వారిని మనమే కట్టడి చేద్దాం

బోథ్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఆర్.ఎం.పి వైద్యం పైన జిల్లా కలెక్టర్ తీవ్రంగా స్పందించడంతో పాటు కొంతమంది వైద్యుల నిర్వాహకం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఇటీవల జరిగిన పలు సమావేశాల్లో జిల్లా కలెక్టర్ రాజార్షిషా పేర్కొనడం జరిగింది. అయితే కలెక్టర్ స్పందించడంతో ఆంధ్రజ్యోతి పత్రికలో పట్టణ ఆసుపత్రులకు ఏజెంట్లుగా మారిన ఆర్ఎంపీలు అన్న వార్త శుక్రవారం ప్రచురితమైంది. దీంతో ఆర్.ఎం.పి డాక్టర్ల వాట్సప్ గ్రూపులో చర్చలు మొదలయ్యాయి. ఆదివారం రోజున నియోజకవర్గం పరిధిలోని ఆర్ఎంపీలు ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన కథనంపై సమావేశమై చర్చించినట్లు తెలిసింది. కొంతమంది ఆర్ఎంపీల తీరు వల్ల వ్యవస్థకు చెడ్డ పేరు వస్తుందని భావించి వారిని కట్టడి చేయాలని ఆర్ఎంపి వైద్యులు నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. వచ్చిరాని వైద్యంతో ఓ వర్ డోస్ ఇంజక్షన్ ఇస్తూ ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చే విధంగా వ్యవహరించే వారిని కట్టడి చేయాలని లేకుంటే వారి తీరు మారకపోతే తగు చర్యలు తీసుకోవాలని ఆగ్రహం వ్యక్తపరిచినట్లు తెలిసింది. కొంతమంది ఆర్ఎంపీలు గ్రామాలలో మనం లేకపోతే ప్రజల ప్రాణాలకు ముప్పు వస్తుందని అయితే ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి తమపై వస్తున్న వార్త కథనాలపై జిల్లా అధికారుల ముందు ఉంచాలని నిర్ణయించారు. ఏది ఏమైనా కథనం గ్రూపులో చర్చకు తెరలేపింది.

రూ.15 లక్షల సైబర్ మోసం

● ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం చేసుకున్న మోసగాళ్లు

● కేసు నమోదు

ముథోల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన సైబర్ నేరగాళ్ల మోసంలో చిక్కుకొని ముథోల్ పట్టణానికి చెందిన ఓ మహిళ రూ. 15,46,000 కోల్పోయింది. ఈ ఘటనపై బాధితురాలు ఫిర్యాదు మేరకు ముథోల్ పోలీసులు ఆగస్టు 9న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా రు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ముథోల్‌కు చెందిన ఓ మహిళ ఒక ప్రైవేట్ ఉద్యోగిని, ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేస్తుంటారు. ఓ ఇంస్టాగ్రామ్ ఐడీ నుంచి ఆమెకు ఒక మహిళ మెసేజ్ చేసి పరిచయం చేసుకుంది. తాము పేదలకు సహాయం చేసే ట్రస్ట్ ఉందని నమ్మించి, ఆమెకు సహాయం చేస్తామని చెప్పింది. దీనిని నమ్మిన బాధితురాలు తన వాట్సాప్ నెంబర్‌ను వారికి ఇచ్చింది. వారు అమెరికా నుంచి డాలర్లు, బంగారాన్ని ఎయిర్‌పోర్ట్ ద్వారా పంపిస్తున్నామని తెలిపారు. 2025 జూలై 7న ఉదయం 10 గంటలకు ఆమెకు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ కస్టమ్స్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి, ఒక పార్సెల్ కోసం రూ. 48,000ల పన్ను కట్టాలని అడిగారు. ఆమె ఫోన్‌పే ద్వారా ఆ మొత్తాన్ని పంపింది. పార్సెల్‌లో విలువైన వస్తువులు ఉన్నాయని, ఈ మొత్తం సరిపోదని చెప్పి, మరి కొంత డబ్బు పంపమని అడిగారు. ఆమె దశలవారీగా వివిధ బ్యాంక్ ఖాతాలకు రూ. 1,98, 000, రూ.5,00,000, రూ. 2,00,000 అలాగే రూ. 6,00,000 పంపింది. మొత్తంగా ఆమె దశల వారీగా రూ. 15,46,000లు పోగొట్టుకుంది. డబ్బులు పంపకపోతే కేసు పెడతామని బెదిరించడంతో బాధితురాలు తన బంధువు సలహా మేరకు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. దీంతో అపరిచితుడు అకౌంట్‌లో ఉన్న రూ. 35,000లు నిలుపుదల చేసినట్లు ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపారు. ఈ ఘటనపై ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న స్వదేశీ హస్తశిల్ప మేళా

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీఎన్జీవోస్‌లో నిర్వహిస్తున్న స్వదేశీహస్తశిల్ప మేళా సందర్శకులను ఆకర్షిస్తోంది. తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, గుజరాత్,రాజస్థాన్, కాశ్మీర్ వంటి రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులను స్థానికంగా విక్రయిస్తున్నారు. హస్తకళల ఉత్పత్తులతో పాటు ఆయుర్వేద మందులు, డ్రైఫ్రూట్స్ సైతం అందుబాటులో ఉండడంతో జనాలు వాటిని ఖరీదు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మేలా నెల రోజులపాటు ఉంటుందని, స్వదేశీ ఉత్పత్తులకు తగిన ప్రోత్సాహం అందించాలని నిర్వాహకులు ఉన్ని కృష్ణన్ పేర్కొన్నారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పర్కొట, చెరువు కట్ట ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. వీరి నుంచి 7 మొబైల్ ఫోన్‌లు, రూ.13,050 నగదును స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ముథోల్‌లో శివ శంకర్ జయంతి



శివశంకర్ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

ముథోల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ నియోజకవర్గ కేంద్రంలో మన బీసీ రిజర్వేషన్ల ప్రదాత, మాజీ గవర్నర్, మాజీ కేంద్ర మంత్రి వర్యులు, న్యాయ కోవిదులు, జెస్టిస్ పుంజాల శివ శంకర్ సార్ జయంతిని జరుపుకున్నారు. ముథోల్ గాంధీ చౌక్‌లో శివ శంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ముథోల్ నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు రోళ్ల రమేష్‌తో పాటు డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, బీసీ సంఘం అధ్యక్షులు వరగంటి విఠల్, పల్లె నాగేష్, మాజీ సర్పంచ్ అనిల్, కే. రాజేశ్వర్, కోరి పోతన్న, గడ్డం సుభాష్, తాటివార్ రమేష్, లవన్ భాస్కర్, టి. శంకర్ పాల్గొన్నారు.

బుద్ధ వందన మహాసభ



కార్యక్రమానికి హాజరైన బౌద్ధ భక్తులు

భైంసా, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని నర్సింగహానగర్ ప్రాంతంలోని బుద్ధ విహార్ కేం ద్రంలో ఆదివారం గణనీయమైన భక్తి, ఆరాధన వాతవరణంలో బుద్ధవందన మహాసభ ఘనంగా జరిగింది. బుద్ధ విహార్ టీమ్ ఆధ్వర్యంలో జరిగిన బుద్ధ వందన మహాసభకు డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి బౌద్ధ భక్తులు, ధమ్మానుయాయులు, పండితులు, విహార్ సభ్యులతో పాటు వివిధ వర్గాలకు చెందిన వారు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సయ్యాజీ బుద్ధుని బోధనలు, ఆశయాలు అనుసరణీయమని వివరించారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేద్దాం

● బీజేపీ మండల అధ్యక్షుడు పసుల నవీన్

కుంటాల, ఆగస్టు, 10 : (ఆంధ్రజ్యోతి) : రాబోయే రోజుల్లో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా ప్రతిఒకరం పనిచేద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పసులనవీన్ అన్నారు. ఆదివారం బీజేపీ మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ బీజేపీ, ప్రతి ఇంటికి బూత్ అధ్యక్షుడు అనే నినాదంతో అందకూర్ గ్రామంలో బూత్ స్థాయి పర్యటన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గల 65వ బూత్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 11 సంవత్సరాల కాలంలో దేశంలో ప్రజలకు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను కరపత్రాల రూపంలో ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా కాలయాపన చేస్తుందని, త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మిగిలి ఉన్న తెలంగాణ బడ్జెట్‌ను అప్పుల్లోకి తీసుకెళ్లిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ సత్వరమే నెరవేర్చాలని లేనిపక్షంలో ఆం దోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో చేపడుతున్న సీసీరోడ్లు, శ్మశాన వాటికలు , ఉపాధి హామీ పథకంలో భాగంగా కేంద్ర నిధులతో చేపట్టినవేనని, రేషన్‌షాపుల్లో వచ్చే బియ్యంలో కేంద్రానిది పెద్దవాటా ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు సాయినాథ్, స్థానిక నాయకులు ప్రశాంత్, లక్ష్మీనారాయణ, వినోద్, అశోక్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గానికి సన్మానం చేస్తున్న దృశ్యం

ఖానాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా గాండ్ల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కోళ్లరాజు, గౌరవ అధ్యక్షులుగా సట్ల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షేక్‌తన్వీర్, కోశాధికారిగా మహమ్మద్ ఇద్రిస్, న్యాయ సలహాదారులుగా గడబోయిన అశో క్, ఉపాధ్యక్షులుగా పుప్పాల శేఖర్, షేక్‌ముజీబ్, కైసర్ మోహిద్దిన్, సమన్వయకర్తగా పాలిక్ శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా ఎంఏ సాజిద్, సంయుక్త కార్యదర్శులుగా మొగిలి నర్సయ్య, షేక్ పర్వేజ్, ముఖ్య సలహాదారులుగా మాలెపు రాజశేఖర్, ఆసూరి సంతోష్, రెడ్డిమల్ల ఏసుదాస్, సింగు రవి, దాసరి కృష్ణమూర్తి, తుమ్మనపల్లి సాంకేతివర్ధన్, కార్యవర్గ సభ్యులుగా రాచమల్ల భాస్కర్, శనిగారం శంకర్, సిహెచ్ రవి, కతులాపురం సుధాకర్, గడబోయిన మహేందర్, గంధం సుమన్, కైసర్, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

నేడు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

నిర్మల్‌రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సోమవారం నిర్వహించనున్నా రు. వీటి నివారణకు జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించనుండగా, ఏర్పాట్లు చేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ తెలిపారు.



జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ నివాస గృహ సముదాయము

కదలరు.. వదలరు!!

(5వ పేజీ తరువాయి...)



విద్యుత్ శాఖ అధికారులకు రాసిన లేఖ

మరికొంత మంది అధికారులు, సిబ్బంది కూడా సక్రమంగా అద్దెను చెల్లించడం లేదని తెలుస్తుంది. ఇదంతా అధికారులకు తెలిసిన తేలికగా తీసుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల సొంత ఇంటి అద్దెలతే ఇలాగానే ఏళ్ల తరబడి వదిలేస్తారా? అనే వాదనలు వినిపిస్తున్నాయి.

కనిపించని కదలిక

ఆదిలాబాద్ మండల పరిషత్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ముగ్గురు మాజీ ఎంపీపీలకు ఇప్పటికే అధికారులు పలుమార్లు నోటీసులు ఇచ్చిన కదలిక కనిపించడం లేదన్నారు. పదవీ కాలం ముగిసిపోవడంతో క్వార్టర్స్‌ను ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చిన స్పందించడం లేదంటున్నారు. అధికారులు ఓ అడుగు ముందుకేసి.. 2, 3, 5 నెంబర్ గల క్వార్టర్స్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని విద్యుత్ శాఖ అధికారులకు మార్చి నెలలోనే లేఖ రాసినా.. ఫలితం లేకుండా పోయింది. ఇప్పటి వరకు విద్యుత్ సరఫరా నిలిచి పోకపోవడంతో అదేతంతు కనిపిస్తుంది. అధికారులు పలుమార్లు హెచ్చరిస్తున్నా.. నేతలు మాత్రం డోంట్ కేర్ అన్నట్లుగానే కనిపిస్తున్నారు. అయితే అధికారులు చట్టపరమైన చర్యలు చేపట్టక పోవడంతోనే ఇలాంటి పరిస్థితికి కారణమవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులకు కూడా చిత్తశుద్ధి లేకపోవడంతో నోటీసులు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.

గుండెపోటుతో అంగన్‌వాడీ టీచర్ మృతి

ఉట్నూర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామ్ లింగంపేటకు చెం దిన అంగన్‌వాడీ టీచర్ సీహెచ్ విజయ(64) ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సమగ్ర బాలభ్యుదయ పథకంలో గత కొన్ని దశాబ్దాలుగా అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఉండగా ఆదివారం ఉదయం నిద్రలోనే చాతినొప్పి వస్తుందంటూ చెప్పడంతో ఆసుపత్రికి తరలించాలని చూస్తుండగా మృతి చెందిందని భర్తస్వామి తెలిపారు. పేద కుటుంబానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ విజయ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. సాటి అంగన్‌వాడీ టీచర్ మృతి చెందినట్లు తెలియగానే ఉట్నూర్ శాంతినగర్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ మీనా కుమారి వారి ఇంటికి చేరుకుని కార్యాలయ అధికారులకు సమాచారం అందించారు.

పద్మశాలి ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పదవీ విరమణ చేసిన ఉమా శంకర్ పదోన్నతి పొంది భైరిమహేందర్, గోగుర్ల ముత్యంలను ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఆడెపు సుధాకర్, గౌర వఅధ్యక్షులు మిట్టపల్లి నర్సయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నిర్మల్ రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ(ఎం) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బీసీలకు 40 శాతం రిజర్వేషన్ల డిమాండ్‌తో పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద ఆదివారం ధర్నా నిర్వహించినట్లు పట్టణ కార్యదర్శి తొడసం శంభు తెలిపారు. కార్యక్రమంలో గంగారాం, షేక్ అతీక్, గంగాధర్, చంద్రభాను, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

భైంసారూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేగాం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి నివాసంలో కుంటాల మండలంలోని దౌనెల్లి గ్రామానికి చెందిన పిరాజీ అనే లబ్ధిదారుడికి సుమారు రూ. 35 వేల సీఎం సహాయ నిధి చెక్కును అందించారు. చెక్కు మంజూరు చేసి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు ముథోల్ మాజీ శాసన సభ్యులు విఠల్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు హైమద్, శ్రావణ్, సుదర్శన్, లక్ష్మణ్, అర్జున్, తదితరులున్నారు.

ఘనంగా అన్నబాహు సాటే జయంతి

కుంటాల, ఆగస్టు, 10 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని లింబా (కే) గ్రామంలో ఆదివారం అన్నబాహు సాటే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నబాహు సాటే విగ్రహానికి పూలమాల వేసి ఆయన అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడుచుకోవాలని మాజీ సర్పంచ్ సవ్వి అశోక్ రెడ్డి, ఆనంద్ రావు పటేల్‌లు అన్నారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గజ్జారాం, వీడీసీ అధ్యక్షులు ముత్యం రెడ్డి, సంఘ అధ్యక్షులు గోనె సురేష్, ఉపాధ్యక్షులు గణేష్ గ్రామస్తులున్నారు.



లింబా (కే)లో అన్నబావు సాటే జయంతిలో పాల్గొన్న గ్రామస్తులు



● శ్యామ్‌పూర్‌లో నిర్మించిన రైతువేదిక

రక్షణ కరువు.. నిధుల బరువు..

● రైతులకు అందుబాటులో వ్యవసాయ శాఖ ● నిధులు లేక నిరసిస్తున్న ఏఈవోలు ● మహిళా రైతులకు, మహిళా సిబ్బందికి కష్టాలు ● రూ.1.47 కోట్లతో దృశ్య, శ్రవణ పరికరాల ఏర్పాటు ● ఆదిలాబాద్ జిల్లాలో దయనీయస్థితిలో రైతు వేదికలు

ఉట్నూర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతాంగానికి ఆధునిక వ్యవసాయ సూచనలు సలహాలు అందించడానికి ప్రభుత్వం నిర్మించిన 49 రైతు వేదికలలో ఒక్కొక్క వేదికలో రూ.3లక్షల వంతున 49 రైతు వేదికలలో రూ.1.47 కోట్లతో ఏర్పాటు చేసిన దృశ్య శ్రవణ పరికరాలతో పాటు గతంలో ఇచ్చిన కూర్చీలు మైక్ సెట్లకు రక్షణ కరువైందని వ్యవసాయ సిబ్బంది వాపోతున్నారు. ప్రభుత్వం జిల్లాలో 101 రైతు వేదికలు నిర్మించగా వాటికి సరైన రక్షణ లేక ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది విచారం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలకు దూరంగా నిర్మించిన రైతు వేదికలకు భద్రత కరువైందని, తలుపులు కూడా సరిగ్గా అమర్చలేదని రైతు వేదికలకు వాచ్‌మన్‌లను నియమించాలని, ప్రహరిగోడలు నిర్మించాలని రైతులు, సిబ్బంది కోరుతున్నారు.

రైతులకు అందుబాటులో వ్యవసాయ శాఖ

గ్రామీణ ప్రాంతాలలోని రైతులకు వ్యవసాయ శాఖను అందుబాటులో ఉంచాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం క్లస్టర్ల వారీగా నిర్మించిన రైతువేదికల నిర్వహణ మరిచి పోయింది. గత ప్రభుత్వం హాయాంలో రైతులకు పంటల సాగు కోసం సలహాలు సూచనలు ఇవ్వడానికి ఆదిలాబాద్ జిల్లాలో ఒక వంద ఒకటి క్లస్టర్లలో రూ.20కోట్ల 20లక్షలతో రైతు వేదికలు 2020లో నిర్మించారు. ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేల అనుచరులతో నిర్మించిన రైతు వేదికల భవనాల నిర్మాణం పూర్తికాకుండానే ప్రభుత్వ ఆదేశాల మేరకు హడావిడిగా ప్రారంభోత్సవాలు నిర్వహించారు. క్లస్టర్ల పరిధిలో ఉన్న రైతుల వివరాలతో పాటు భూముల వివరాలను తెలుసుకుని రైతులకు ఎంతో సేవ అందించే వీలుగా నిర్మించిన రైతు వేదికలకు నిర్వహణ కోసం ప్రతినెల ఒక్కొక్క రైతు వేదికకు రూ.9వేల వంతున 101 రైతు వేదికలకు ప్రతినెల రూ.9.09 లక్షలు ప్రభుత్వం కేటాయించాలని భావించింది.

నిధులు లేక నీరసిస్తున్న విస్తరణ అధికారులు

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో రైతుల ప్రయోజనం కోసం నిర్మించిన రైతు వేదికల నిర్వహణ కోసం ప్రతినెలా రూ.తొమ్మిది వేలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం 2021లో కేవలం ఐదు నెలల పాటు రూ.9వేల వంతున మంజూరు చేసింది. ఈ నిధుల ద్వారా రైతు వేదికకు అవసరమయ్యే కరెంట్ చార్జీలు, ఉడ్చేపని మనిషి కోసం, స్టేషనరీ కొనుగోలుకు వినియోగించాలని ఆదేశించారు. 2021 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఈ నిధులు విడుదల చేయక పోవడంతో ఆయా మండలాల్లో ఉన్న 101 క్లస్టర్లలో పని చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు నిధులు రాక ఇబ్బందులు పడుతున్నారు. రైతు వేదికలకు ఉన్న కరెంట్ కనెక్షన్ చార్జీలు చెల్లించలేక పోవడంతో.. ఒక్కొక్క క్లస్టర్ నుంచి ట్రాన్స్కో అధికారులకు రూ.25వేల వంతున బాకీ ఉన్నట్లు తెలుస్తుంది. అదేవిధంగా ప్రతీరోజు క్లస్టర్‌కు వచ్చే రైతుల కోసం రైతు వేదికలను శుభ్రంగా ఉంచడానికి వర్కర్‌కు ఏఈవోలే డబ్బులు చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉట్నూర్ ఏజెన్సీలోని ఉట్నూర్ మండలంలో షాంపూర్, దంతన్‌పల్లి, ఉట్నూర్, శ్యామ్‌నాయక్‌తండా, పులిమడుగు, తాండ్ర, నర్సాపూర్‌బి, ఉమ్రి, ఇంద్రవెల్లి మండలంలో కేస్లాపూర్, ఇంద్రవెల్లి, వాల్గొండ హీరాపూర్, ముత్నూర్, దోడంద, నార్నూర్ మండలంలో తాడిహత్నూర్, నార్నూర్, మహాగావ్, ఉమ్రి, బాబేఝరీ,గాదిగూడ మండలంలో ఖండ్వా, గాదిగూడ, లోకారిలతో పాటు జిల్లా వ్యాప్తంగా 101 క్లస్టర్ల వారీగా రైతు వేదికల నిర్మాణం నిర్మించిన అధికారులు నిధులు కేటాయించక పోవడంతో వ్యవసాయ విస్తరణ అధికారులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు.



రైతువేదికలో ఏర్పాటు చేసిన దృశ్య శ్రవణ పరికరాలు

మహిళా రైతులకు, సిబ్బందికి కష్టాలు

జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్లస్టర్ల వారీగా నిర్మించిన రైతు వేదికలకు మరుగుదొడ్ల నిర్మాణం పూర్తికాకుండానే ప్రారంభోత్సవాలు చేయడంతో పాటు క్లస్టర్లకు మంచినీటి సౌకర్యం కూడా లేకపోవడంతో మహిళా సిబ్బందితో పాటు మహిళ రైతులు కూడా కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఆర్భాటంగా నిర్మాణాలు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు ఇంకా బిల్లులు రాక పోవడంతో కొన్ని కొన్ని పనులు పూర్తి చేయక పోవడంతో సిబ్బంది ఇబ్బందులకు గురి అవుతున్నారు.

రూ.1.47కోట్ల వ్యయంతో దృశ్య, శ్రవణ పరికరాలు

ప్రభుత్వం వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడానికి ఒక్కొక్క రైతు వేదికకు రూ.3 లక్షల వ్యయంతో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు కేటాయించింది. జిల్లాలో కేవలం 34 రైతు వేదికలకు మాత్రమే దృశ్య, శ్రవణ పరికరాలు అందించింది. ఇదే కాకుండా ఇప్పటికే ప్రతి రైతు వేదికకు 125 కూర్చీలు, రెండు బల్లలు, ఎస్‌మోడల్ కూర్చీలు, రెండు వీల్‌చైర్లు, ఒక్కొక్క మైక్ సెట్ కూడా కేటాయించింది. దీంతో తలుపులు బాగాలేక, ఊరికి దూరంగా ఉన్న రైతు వేదికలకు భద్రత కరువై పోవడంతో పోకిరిలకు అడ్డాలుగా రైతు వేదికలు మారాయి. దీంతో తాగుబోతులు అక్కడికి చేరుకుని జల్సాలు నిర్వహిస్తున్నారు. తాగిన మైకంలో చోరీలకు పాల్పడితే తమ పరిస్థితి ఏమి అవుతుందని ఉద్యోగులు వాపోతున్నారు.

రైతు వేదికలకు నిధులు మంజూరు చేయాలి

: కందుకూరి రమేష్, మాజీ ఎంపీటీసీ, ఉట్నూర్



ఉమ్మడి జిల్లాలో రైతులకు సూచనలు సలహాలు ఇవ్వడానికి నిర్మించిన రైతు వేదికలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలి. కాంట్రాక్టర్లు రైతువేదికల పనులు పూర్తి చేయకపోవడంతో రైతు శిక్షణ శిబిరాలకు వెళ్తున్న రైతులకు మంచినీటి సౌకర్యం లేకపోగా మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

: రమేష్ గిత్తే, ఏవో, ఉట్నూర్



ఉట్నూర్ మండలంలో 8 క్లస్టర్ల వారీగా ప్రభుత్వం రైతు వేదికలు మంజూరు చేసింది. ప్రతినెలా నిర్వహణ కోసం రూ.9వేలు కేటాయిస్తామని చెప్పింది. కానీ సరిగ్గా నిధులు విడుదలకాకపోవడంతో క్లస్టర్‌లలో పని చేస్తున్న ఏఈవోలకు నిర్వహణ నిధులు కేటాయించాలని జిల్లా అధికారుల ద్వారా ప్రతిపాదనలు పంపించడం జరిగింది. రైతు వేదికలకు కరెంట్ బకాయిలు పెరిగి పోయాయి.

రైతు బీమా దరఖాస్తుకు 3 రోజులే గడువు

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ● 18 నుంచి 59 వయస్సు గల రైతులు అర్హులు ● జూన్ 5వ వరకు పట్టాదారు పాసు బుక్కు వచ్చిన రైతులకు అవకాశం

భైంసా, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అన్నదాత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్న రైతు బీమా పథకానికి అర్హత కలిగిన రైతుల నుంచి దరఖాస్తు స్వీకరణ ప్రక్రియకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఇందుకు సంబంధించి శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అర్హతలు కలిగిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 13 లోగా దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ పూర్తి చేసి యాప్‌లో వాటి నమోదును పూర్తి చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. పాతవారు కాకుండా కొత్తగా అర్హులైన రైతుల నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరించాలని ఉత్తర్వులో సూచించింది. ఇందుకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికార యంత్రాంగం కసరత్తులను ముమ్మరం చేసింది.

● అర్హులు వీరే..

రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అర్హతలను జారీ చేసింది. 1966 ఆగస్టు 14 నుంచి 2007 ఆగస్టు 14 మధ్య కాలంలో జన్మించిన వారు దరఖాస్తుకు అర్హులుగా పేర్కొంది. ప్రస్తుత సంవత్సరం జూన్ 5 లోపు పట్టాదారు పాసు పుస్తకం పొందిన లేని పక్షంలో తహసీల్దార్ వద్ద డిజిటల్ సిగ్నేచర్ పూర్తి చేసుకున్న రైతులు బీమా కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని ఉత్తర్వులో వివరించారు. పట్టాదారు పుస్తకం లేదా డిజిటల్ సిగ్నేచర్ పత్రం , ఆధారు కార్డు, నామినీ ఆధారుకార్డు, బ్యాంక్ ఖాతా వివరాలను సంబంధిత ఏఈవోలకు అందచేసి రైతు భీమాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఉత్తర్వులు తెలిపింది. ఇప్పటికే నమోదు చేసుకున్న రైతులు ఏవైనా సవరణలుంటే ఈ నెల 12 లోగా వ్యవసాయాధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించింది.

నిర్మల్ జిల్లాలో రైతు బీమా అమలైంది ఇలా..

సంవత్సరం	నమోదైన రైతులు	లబ్ధిపొందిన వారు
2018-19	84,454	547
2019-20	85,384	517
2020-21	90,300	702
2021-22	96,397	642
2022-23	1,02,526	634
2023-24	1,12,793	699
2024-25	1,15,906	627







భైంసా బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

రాఖీతో ఆర్టీసీకి అదనపు ఆదాయం

భైంసా, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రక్షా బంధన్ వేడుకలతో ఆర్టీసీకి అధనపు ఆదాయం సమకూరింది. పర్వదిన వేడుకలను పురస్కరించుకొని రాఖీలు కట్టేందుకు గాను సోదరీమణులు సోదరుల వద్దకు, సోదరులు సోదరీమణుల దగ్గరకు రాకపోకలు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం జిల్లాలోని రెండు బస్సు డిపోలకు ఆధనపు చేకూరింది. భైంసా బస్ డిపోకు శనివారం రూ.6 లక్షల ఆధనపు ఆదాయం వచ్చినట్లుగా ఇక్కడి డిపో అధికారులు వెల్లడించారు. ఇక్కడి బస్సు డిపోకు రోజు సరాసరి రూ.15 లక్షల ఆదాయం సమకూరుతుంది. శనివారం రక్షా బంధన్ వేడుకలను పురస్కరించుకొని ప్రయాణీకుల రాకపోకలు అధికంగా జరిగాయి. ఈ క్రమంలో రోజు వారి ఆదాయం రూ.15 లక్షలు ఉండగా.. శనివారం అధనంగా రూ.6 లక్షల ఆదాయం సమకూరి మొత్తం రూ.21 లక్షల ఆదాయం చేకూరింది. భైంసా బస్సు డిపో పరిధిలో 47 అద్దె బస్సులు, 28 సంస్థ బస్సులు కలిపి మొత్తం 75 బస్సులు ఉన్నాయి. నిత్యం సంబంధిత బస్సులు ద్వారా 25రూట్లలో సుమారు 28,500 కి.మీ. మేర రాకపోకలు జరుగుతాయి. శనివారం ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా అదనపు ట్రిప్పుల వల్ల ఇక్కడి బస్సులు 30,800 కిలోమీటర్ల మేర రాకపోకలు చేపట్టాయి. తద్వారా రూ.6 లక్షల ఆధనపు ఆదాయం సమకూరింది. పర్వదిన వేడుకలకు వచ్చిన వారంతా సోమవారం తిరుగు ప్రయాణాలు చేపట్టనున్నారు. ఈ క్రమంలో సోమవారం కూడా అదనపు ఆదాయం సమకూరుతుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు.

పోయిన ఫోన్‌ను.. పట్టేద్దాం..!

● సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదుతో గుర్తింపు సులువు ● ఆధునిక టెక్నాలజీతో పోలీసుల రికవరీ ● బోధన్ డివిజన్‌లో ఏడాదిలో 300 ఫోన్ల అప్పగింత

బోధన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌లు పోయిన సమాయల్లో అందులో భద్రపర్చిన వివరాలు, నెంబర్లు ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. దీంతో కొంతమంది కొంత ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. చోరీ చేసిన ఫోన్‌లతో లావాదేవీలు నడిపి బాధితుల బ్యాంక్ ఖాతాలు కొల్లగొట్టిన సందర్భాలు ఉన్నాయి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పోర్టల్‌ను తెచ్చింది. పోయిన ఫోన్‌లను రాబట్టేందుకు ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేస్తే సరిపోతుంది. పోయిన ఫోన్‌ను ఎవరైన వినియోగిస్తే వెంటనే సమాచారం తెలిసిపోతుంది.



ఆలస్యం తగదు..

సెల్‌ఫోన్ చోరీకి గురైన, అజాగ్రత్తతో పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలి. సంబంధిత పోర్టల్‌లోకి వెళ్లగానే రిక్వెస్ట్ బ్లాంకింగ్ లాస్ట్ స్టోలైన్ మొబైల్ లింక్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయాల్సి ఉంటుంది. అందులో సెల్‌ఫోన్‌కు సంబంధించిన 15డిజిట్స్ ఈఎంఈఐ నెంబర్ ఫోన్ కంపెనీ పేరు, మోడల్ పేరు, కొనుగోలు చేసిన బిల్లును నమోదు చేయాల్సి ఉంటుంది. తర్వాత ఓటీపీ కోసం మరో సెల్‌ఫోన్ నెంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ వివరాలను నమోదు చేసిన తర్వాత ఫిర్యాదుదారుడికి ఐడీ నెంబర్ వస్తుంది. అనంతరం మొబైల్ పని చేయకుండా చేస్తుంది. ఏ కంపెనీ సెల్‌ఫోన్ అయిన సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయగానే బ్లాక్ అవుతుంది. ఇక దానిని ఎవరు వినియోగించలేదు. దీంతో పాటు ఫోన్ ఎక్కడ ఉంది అనేది వివరాలు పోలీసు శాఖలోని ఐడీ సెంటర్‌కు అందుతుంది. దీంతో ఐడీసెల్ పోలీసులు పోయిన ఫోన్‌కు రికవరీ చేసి ఇస్తారు. ఫోన్ పోయిన సందర్భంలో పోలీస్ స్టేషన్‌లలో, మీసేవ కేంద్రాల్లో నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

డివిజన్‌లో 600లకు పైగా ఫిర్యాదులు

బోధన్ డివిజన్‌లో ఈ ఏడాది 600లకు పైగా ఫోన్‌లు పోయినట్లు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులపై బోధన్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ఇప్పటి వరకు 300లకు పైగా ఫోన్‌లను స్వాధీనం చేసుకుని ఫోన్‌ల యాజమానులకు అప్పగించింది. గతంలో ఫోన్‌లు పోతే తిరిగి లభించడం కష్టంగా లభించేది. ఏదైనా కేసుకు సంబంధించిన సీడీఆర్‌లో ఫోన్ వివరాలు నమోదు చేస్తే ఆ ఫోన్‌ను ఎవరైన వినియోగిస్తే అప్పుడు గాని పట్టుకునే వారు చాలా మంది ఫోన్‌లు పోయినప్పుడు చేసేది లేక కొత్త ఫోన్‌లు కొనుగోలు చేసేవారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తెచ్చిన సీఈఆర్ఐ పోర్టల్‌తో ఇబ్బందులు తొలగిపోయాయి.

పాత ఫోన్‌లను కొనుగోలు చేయవద్దు


: శ్రీనివాస్, బోధన్ ఏసీపీ



పాత ఫోన్‌లను ఎలాంటి రసీదులు లేకుండా కొనుగోలు చేయవద్దు. ఎక్కువగా పాత ఫోన్‌లు చోరీ చేసినవి ఉంటాయి. అలాంటి ఫోన్‌లను కొనుగోలు చేస్తే పోలీసులకు పట్టుబడతారు. ఫోన్‌లు పోతే వెంటనే పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలి. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన ఫోన్‌ను రికవరీ చేసే అవకాశం ఉంటుంది.



పోయిన ఫోన్‌లను రికవరీ చేసి యాజమానులకు అప్పగిస్తున్న పోలీసులు



రైతు వేదికలకు రక్షణ కరువు.. నిధుల బరువు 7
బీసీలకు హామీలు నెరవేర్చేది ఎన్నడు?: జోగు 6
రక్షా బంధన్‌తో ఆర్టీసీకి అదనపు ఆదాయం 7
రైతు బీమా దరఖాస్తుకు మూడు రోజులే గడువు 7



జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ నివాస గృహ సముదాయము

కదలరు.. వదలరు..

> ఆదిలాబాద్ మండల పరిషత్.. అధికారిక నివాస గృహాలను కొందరు నేతలు కబ్జా చేసి అక్రమంగా నివాసం ఉండడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఏళ్ల తరబడి అనధికారికంగా నివాసం ఉంటూ ప్రభుత్వ క్వార్టర్స్‌ను వదలడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా.. క్వార్టర్స్ నుంచి అసలు కదలడమే లేదంటున్నారు. గతంలో ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని కలెక్టర్‌చౌక్ సమీపంలోని టూ టౌన్ పోలీసు స్టేషన్ వెనుక మొత్తం 8 క్వార్టర్స్‌తో పాటు మరో 11 వ్యాపార సముదాయాలను నిర్మించింది. ఇందులో మండల పరిషత్ ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, సిబ్బందికి నివాసం ఉండేందుకు అవకాశం కల్పించారు.

- జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ క్వార్టర్స్‌లో అనధికారికంగా నివాసం
- పదవీ కాలం ముగిసిన ముగ్గురు మాజీ ఎంపీపీల ఇష్టారాజ్యం
- రూ.లక్షల్లో పేరుకు పోయిన ఇంటి అద్దె బకాయిలు
- అధికారులు పలుమార్లు హెచ్చరించినా.. లెక్క చేయని నేతలు
- నోటీసులు ఇస్తూ.. చేతులు దులుపుకుంటున్న సంబంధిత శాఖల అధికారులు

ఆదిలాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గత స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన ఆదిలాబాద్ మండల పరిషత్ ఎంపీపీలు, మావల మండల పరిషత్ ఎంపీపీలకు మూడు క్వార్టర్స్‌ను కేటాయించారు. దీంతో గత కొన్నేళ్లుగా ఈ క్వార్టర్స్‌లోనే నివాసం ఉంటూ వస్తున్నారు. అయితే వారి పదవీ కాలం ముగిసిపోయినా.. ఇంకా ప్రభుత్వ క్వార్టర్స్‌ను ఖాళీ చేసి వెళ్లడం లేదంటున్నారు. ఏళ్ల తరబడి ముగ్గురు నేతలు అనాధికారికంగా నివాసం ఉండడంపై అభ్యంతరాలు వస్తున్నాయి. గత కొంత కాలంగా దీనిపై ఫిర్యాదులు రావడంతో మండల పరిషత్ అధికారులు అభ్యంతరం చెప్పినా.. అసలు పట్టించుకోవడమే లేదంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ నివాస గృహాలను దక్కించుకున్నారు. ప్రభుత్వం మారిన, పదవులు కోల్పోయిన నేతలు మాత్రం ఇంకా క్వార్టర్స్‌ను విడిచిపెట్టక పోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

త్వరలోనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం

: స్వప్నశీల, ఎంపీడీవో, ఆదిలాబాద్ రూరల్ మండలం

నేను ఇటీవలే ఎంపీడీవోగా బాధ్యతలను స్వీకరించా. జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ నివాస గృహాల విషయంలో నాకు పెద్దగా అవగాహన లేదు. క్వార్టర్స్‌లో ఎవరెవరు ఉంటున్నారు అనే విషయాన్ని తెలుసుకుని చర్యలు తీసుకుంటాం. ఇది వరకే పలుమార్లు నోటీసులు ఇవ్వడం జరిగిందని మా సిబ్బంది చెబుతున్నారు. తదుపరి చర్యల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

ఒత్తిళ్లకు తలొగ్గుతున్న అధికారులు

ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గుతున్నట్లు తెలుస్తుంది. నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. 8 అధికారిక నివాస గృహాలలో నుంచి మూడు ప్రజాప్రతినిధులకు కేటాయించగా.. మరో ఐదు క్వార్టర్స్‌ను మండల పరిషత్, జడ్పీ ఉద్యోగులు, సిబ్బందికి కేటాయించారు. అర్హత లేని వారికి నిబంధనలకు విరుద్ధంగా కేటాయించినట్లు తెలుస్తుంది. ఒకరిద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కూడా నివాస గృహాలను కేటాయించినట్లు సమాచారం. ఇందులోనూ నిబంధనలు పాటించ లేదన్న విమర్శలు వస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా క్వార్టర్స్‌ను కేటాయించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే కొన్ని క్వార్టర్స్‌కు చిన్నపాటి మరమ్మతులు చేపట్టక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

నయా పైసా అద్దె చెల్లించలే..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రజాప్రతినిధులు ఉద్యోగులు, సిబ్బంది ఎవరైనా అధికారిక నివాస గృహాలలో ఉంటే.. నిర్ణయించిన మొత్తంలో నెలనెలా అద్దెను చెల్లించాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ మండల పరిషత్ క్వార్టర్స్‌కు నెలకు రూ.2 వేల అద్దెను చెల్లించాలని నిర్ణయించారు. దీని ప్రకారం ఏడాదికి రూ.24 వేలను ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఐదేళ్లు గడిచిపోతున్నా.. ప్రజాప్రతినిధులు మాత్రం నయా పైసా అద్దెను చెల్లించడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. అసలే అనాధికారికంగా నివాసం ఉంటున్న నేతలు ఆపైగా అద్దె బకాయిలను చెల్లించక పోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఒక్కొక్కరు ఐదేళ్లకు గాను రూ.లక్షా 20 వేలను చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన ముగ్గురు మాజీ ఎంపీపీలు సుమారుగా రూ.3లక్షల 60వేలకు పైగానే చెల్లించాలని అధికారులు చెబుతున్నారు. అలాగే

(తరువాయి 6వ పేజీలో....)



ఆదిలాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఘనంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి జన్మదినం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలోని ప్రజాసేవాభవన్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా, మంత్రిగా జూపల్లి కృష్ణారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఆయనలాంటి అనుభవజ్ఞులు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రావడం అదృష్టమన్నారు. ఆయన నేతృత్వంలో తన ఆదేశాలకనుగుణంగా కలిసి పనిచేస్తామని, పార్టీని మరింత బలోపేతం చేసి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతామన్నారు. ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్, నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, బండి దేవిదాస్ చారి, డొగ్గలి రాజేశ్వర్, సందా నర్సింగ్, మహ్మద్ రఫీఖ్, అజయ్, రాంరెడ్డి, అతిక్ ఉర్ రహమాన్, అయాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి కళంకం తెస్తున్న వారిపై కఠిన చర్యలు

- కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల రెండు విద్యా సంస్థలలో చోటు చేసుకున్న బాలలపై అసభ్య ప్రవర్తనలకు సంబంధించి జిల్లా పాలన యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకుందని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. తాంసి మండలంలోని జడ్పీ హైస్కూల్‌లో ఒక ఉపాధ్యాయుడు విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు సమాచారం అందిన నేపథ్యంలో అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా స్పోర్ట్స్ స్కూల్‌లోని ఒక కోచ్ విద్యార్థిపై అసభ్యంగా ప్రవర్తించాడని, బాధిత విద్యార్థి తల్లి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విచారణ అనంతరం సదరు కోచ్‌పై సైతం పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి ఉద్యోగం నుంచి తొలగించినట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులు పోక్సో చట్టం ప్రకారం పాటించాల్సిన నియమాలపై కలెక్టర్ స్పష్టమైన సూచనలు చేశారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సోయం బాపురావు

ఆదివాసీ వీరుల త్యాగాలను గుర్తించిన ఐరాస

- రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపురావు
- చత్తీస్‌గడ్‌లోని డోంగర్‌గావ్‌లో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఆదిలాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చత్తీస్‌గడ్ రాష్ట్రంలోని డోంగర్‌గావ్ గ్రామంలో రాజ్‌గోండ్ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మాజీ ఎంపీ, రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయంబాపురావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం రాజ్‌గోండ్ సేవా సమితి జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సోయంబాపురావు మాట్లాడుతూ జాతి కోసం పోరాటం చేసిన వీరుల త్యాగాలను చూసి ఐక్యరాజ్యసమితి ఆదివాసీ దినోత్సవంను గుర్తించిందన్నారు. జాతికి ఎవరు అన్యాయం చేస్తున్నారు చర్చించి మాట్లాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలు ఏవైతే ఉన్నాయో వాటిని ఆదివాసీ ప్రజలకు తెలియచెప్పేందుకు కూడా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికి కూడా ఆదివాసుల పై ఫారెస్టు అధికారులు దాడులు కొనసాగుతున్నాయన్నారు. ఆదివాసుల సమస్యల పై రాజ్‌గోండు సేవా సమితి పోరాడుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఆదివాసీలు ఏకమై తమకు రావాల్సిన హక్కుల పై పోరాడాలని సూచించారు. ఇందులో రాజ్‌గోండ్ సేవా సమితి జాతీయ నాయకులు సిడాంఅర్జు, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు సెడ్మకి ఆనంద్‌రావు, నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

చిరుజల్లులకు రోడ్డంతా బురద

- లక్ష్మీపూర్ గ్రామస్థులను వీడని రహదారి కష్టాలు

బోథ్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన లక్ష్మీపూర్ గ్రామానికి వెళ్లాలంటే వర్షాకాలం ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా బురదమయంగా మారింది. ఫలితంగా ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనాల వారు వెళ్లాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షానికి రోడ్డంతా బుర్దమయంగా మారడంతో కాలినడక కష్టతరంగా మారిందని గ్రామస్థులు వాపోతున్నారు.



లక్ష్మీపూర్ గ్రామానికి వెళ్లే రహదారి ఇలా..

అత్యవసరమైతే..

వర్షాకాలంలో బురదమయమైన రోడ్డుపైన ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్థులు అంటున్నారు. తమ గ్రామానికి అత్యవసర వైద్యం అవసరమైతే అంబులెన్స్ వచ్చేందుకు ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. అత్యవసర వైద్యం నిమిత్తం రోగులను తీసుకురావాలంటే తమ గ్రామస్థులు అంబులెన్స్ ఎక్కడి వరకు వస్తే అక్కడ వరకు రోగులను అతి కష్టం మీద తీసుకువెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. అధికారులు బురద మాయమైన చోట గుంతలు పూడ్చి కాలినడకకు కష్టం కాకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వర్షం పడితే.. అంతే సంగతులు!

వర్షాకాలం వర్షం కురిసింది అంటే బయటకు రాలేకపోతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు తమ గ్రామ ప్రజల ఇబ్బంది గుర్తించి రహదారి పైన గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ నిర్వహణ ఇదేనా?

- పిచ్చిమొక్కలు, చెట్ల పొదల్లో ఏడబ్ల్యూఎస్ పరికరం

బజార్‌హత్నూర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వాతావరణాన్ని అంచనా వేయడానికి అలాగే ప్రకృతి వైపరీత్యాలను పర్యవేక్షించడానికి ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ ఆధునాతన పరికరం వాతావరణంలో ఉష్ణోగ్రత, తేమ, గాలి వేగం, దిశ, వర్షపాతం, వాతావరణ పీడనం, సౌర కిరణాలను కొలిచే పలు రకాల వాతావరణ సెన్సార్లతో అమర్చబడిన అ ధునాతన పరికరం. దీని ఆధారంగా మనకు వాతావరణంలో జరిగే మార్పులు, వర్షాపాతం తెలుసుకోవచ్చు. ఆటోమెటిక్‌గా సెన్సార్ నుంచి డేటా కలెక్ట్ చేసుకుని సర్వర్ ద్వారా సెంట్రల్ వాతావరణ కేంద్రానికి డేటాని అనుసందానం ఉంటుంది. మండల కేంద్రంలోని 33 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో ఏపుగా పెరిగిన చెట్ల పొదల్లో, పచ్చికబయళ్లలో ఉంది. కనీసం నిర్వహణ లేక పొదలలో పూర్తిగా కప్పి ఉండగా.. ఇంత మంచి పరికరానికి కనీస నిర్వహణ ఉండదా అంటూ? అటువైపు వెళ్లిన ప్రతీ ఒక్కరు ముక్కున వేలేసుకుంటున్నారు.



పిచ్చిమొక్కల మధ్యన ఏడబ్ల్యూఎస్ స్టేషన్ ఇలా..



ఇచ్చోడలో దుకాణ సముదాయాల్లోకి చేరిన వర్షపు నీరు

ఇచ్చోడలో జోరు వాన


- అప్పటి వరకు మండుటెండ.. అంతలోనే కుండపోత
- వరదనీటితో నిండిపోయిన రోడ్లు
- అతలాకుతలమైన వ్యాపార సముదాయాలు
- పలు దుకాణాల్లోని చేరిన వర్షపు నీరు
- భారీ వర్షంతో స్థానికులకు తప్పని తిప్పలు

ఇచ్చోడ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అప్పటి వరకు మండె ఎండతో ఉన్న వాతావరణం ఒక్కసారిగా కురిసిన వర్షానికి ఇచ్చోడ పట్టణంలోని వ్యాపార సముదాయాలు అంతా అతలాకుతలమయ్యాయి. దుకాణాలలోనికి, కాలనీ రోడ్లు వరద నీటితో నిండి పోయాయి. ఇచ్చోడ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన రెండు వరుసల రహదారికి ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం చేపట్టక పోవడంతో ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి దుకాణాల్లో, కాలనీ రోడ్ల పై నీరు నిలిచింది. మురుగు కాలువల్లో పూడిక తీయక పోవడం, రోడ్డు ఎత్తుగా ఉండడంతో వర్షపు నీరు ముందుకు సాగలేక రోడ్డు పక్కనే ఉన్న దుకాణ సముదాయాల్లోకి వెళ్లింది. దీంతో వరదనీరు దుకాణాల్లో వరదతో నిండిన టాకీస్ రోడ్డ చేరడంతో వ్యాపారస్థులు లబోదిబోమన్నారు. వర్షాకాలంలో వచ్చే ముసురువర్షాలకు ఇచ్చోడ పట్టణం నిండా మునిగి పోతుందేమోనని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు ఇచ్చోడ సమస్యపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అక్రమంగా గంజాయి సాగు

- పెండల్వాడలో వేర్వేరు ఇళ్లల్లో మొత్తం 32 మొక్కల పట్టివేత
- వీటి విలువ రూ.లక్షకు పైనే : సీఐ

తలమడుగు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పెండల్వాడ గ్రామంలో అక్రమంగా గంజాయి మొక్కలను ఇంటి వద్ద సాగు చేస్తున్నారని సమాచారం రావడంతో ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిందర్, తాంసి ఎస్సై జీవన్ రెడ్డి పోలీసు సిబ్బందితో ఆదివారం తనిఖీ చేశారు. దీనిలో భాగంగా పెండల్వాడ గ్రామానికి చెందిన మడవి సోను బాయ్ తన ఇంటి వద్ద 25 గంజాయి మొక్కలు, ఆత్రం అయ్యో ఇంటి వద్ద రెండు గంజాయి మొక్కలు, ఆత్రం సోనీ రో ఇంటి వద్ద మూడు మొక్కలు, అలాగే టేకం మలుగు ఇంటి వద్ద రెండు గంజాయి మొక్కలు కలిపి మొత్తం 32 మొక్కలు లభించాయని తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.లక్షా 60 వేల వరకు ఉంటుందని పోలీసుల పేర్కొన్నారు గంజాయి మొక్కలు సాగు చేస్తున్న నిందితులు పరారీలో ఉన్నారన్నారని, వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఎవరైనా గ్రామాల్లో గంజాయి మొక్కలు సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ఫణిందర్ హెచ్చరించారు







పెండల్వాడ గ్రామంలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే పాయల

జైనథ్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం సాత్నాల మండల కేంద్రంలో బీజేపీ పార్టీ కార్యాలయాన్ని నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు వురు గ్రామస్థులు ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. చేరిన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జైనథ్ మండల పార్టీ అధ్యక్షుడు లోక కరుణాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అస్తక్ సుభాష్, పోతరాజు రమేష్, నాయకులు సురేష్, పంద్ర రాము, సంతోష్ దొడ, కుంచాల మహేందర్, రేణుకబాయిలతో పాటు ఆయా గ్రామాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సాత్నాలలో బీజేపీ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

గుండెపోటుతో అంగన్‌వాడీ టీచర్ మృతి

ఉట్నూర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామ్ లింగంపేటకు చెందిన అంగన్‌వాడీ టీచర్ సీహెచ్ విజయ (64) ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ షభ్యులు తెలిపారు. సమగ్ర బాలభ్యుదయ పథకంలో గత కొన్ని దశాబ్దాలుగా అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఉండగా ఆదివారం ఉదయం నిద్రలోనే చాతినొప్పి వస్తుందంటూ చెప్పడంతో ఆసుపత్రికి తరలించాలని చూస్తుండగా మృతి చెందినట్లు భర్త స్వామి తెలిపారు. పేద కుటుంబానికి చెందిన విజయ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆమె మృతి విషయాన్ని శాంతినగర్‌కు అంగన్‌వాడీ టీచర్ మీనాకుమారి అధికారులకు సమాచారం అందించారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.